క్లుప్తంగా

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

కొడంగల్: పట్టణంలోని కేశవ స్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట తెలిపారు. రాత్రి 8 గంటలకు శ్రీహరి వశిష్ట ఇంటినుంచి శ్రీ కృష్ణ భగవానుడిని కేశవ స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్తారు. రాత్రి 12.06 నిమిషాలకు శ్రీ కృష్ణ జననం, అభిషేకం, అర్ఘ్యం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 17న ఉదయం పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం 3 గంటలకు బాలగోకులం, సాయంత్రం 4 గంటలకు డోలారోహణం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులతో శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి విజేతలు ఎనిమిది మందిని ఎంపిక చేసి 5 గ్రాముల చొప్పున వెండి పతకం బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు 94415 66051 నంబర్‌పై సంప్రదించాలని కోరారు.

లగచర్లలో వీధి లైట్లు ఏర్పాటు



లగచర్లలో వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మయ్య

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు 100 వీధిలైట్లను శుక్రవారం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్య ఆధ్వర్యంలో లగచర్ల, పులిచర్ల కుంట తండా, గడ్డమీది, ఈదుల బండ తండాలలో వీధి లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన చౌరస్తాలో, దేవాలయాల వద్ద ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో రాత్రి వేళల్లో చీకటి ఉండకుండా ప్రత్యేకంగా వీధి లైట్లు ఏర్పాటు చేసినట్లు లక్ష్మయ్య తెలిపారు.

హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ తప్పనిసరి

వైద్యాధికారి మజీద్‌ఖాన్



విద్యార్థులకు శానిటరి న్యాప్కిన్స్ పంపిణీ చేస్తున్న మజీద్‌ఖాన్

బంట్వారం: హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ తప్పనిసరిగా చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మజీద్‌ఖాన్ పేర్కొన్నారు. ఇండిపెండెన్స్‌డే సందర్భంగా శుక్రవారం ఆయన బంట్వారం కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు ఐదు వందల శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ చేసి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత చాలా ముఖ్యమన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. వంటకాలపై ఈగలు, దోమలు వాలకుండా తగిన మూతలను పెట్టాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన రేణుక ఎల్లమ్మ దేవతకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంపై అమ్మ వారి ఆశీస్సులు ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూసుకోవాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయరాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంపై చిన్నచూపు తగదు

దోమ: అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వ కార్యాలయాలపై ఎరగవేయాల్సిన జాతీయ జెండాను అధికారులు విస్మరించారు. శుక్రవారం బొంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ జెండాను సంబంధిత అధికారులు ఆవిష్కరించలేదు. ఈ విషయంలో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీచర్ లేకుంటే సంబంధిత అధికారులు కూడా రాలేకపోయారని మండిపడ్డారు. ఎంఈఓ బొంపల్లి వెంకట్ జిల్లా పరిషత్ పాఠశాలకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పరిధిలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉన్నప్పటికీ గ్రామంలోని పోస్టు ఆఫీస్, పంచాయతీ కార్యాలయం, వెటర్నరీ కార్యాలయం, పీహెచ్‌సీ, బస్టాండ్‌లలో జాతీయ జెండాలను ఆవిష్కరించి అంగన్‌వాడీ కేంద్రంలో విస్మరించడం బాధాకరం. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొడంగల్ రూరల్: బీసీ గురుకుల కళాశాల ఆవరణలో విద్యార్థుల విన్యాసాలు



బంట్వారం: సొసైటీ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేసిన చైర్మన్ రాంచంద్రారెడ్డి



దుద్యాల్: తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ కిషన్, ప్రజా ప్రతినిధులు



పూడూరు: పీఏసీఎస్ కార్యాలయం ఎదుట జెండా ఎగురవేస్తున్న చైర్మన్ సతీష్‌రెడ్డి



మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి



నవాబుపేట: అంబేడ్కర్ విగ్రహంవద్ద జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



దౌల్తాబాద్: తహసీల్దారు కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న గాయత్రి



తాండూరు: తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల సమీపంలో జెండాకు వందనం చేస్తున్న విద్యార్థులు

మువ్వన్నెల మురిపెం



యాలాల: కాంగ్రెస్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, తదితరులు

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, ప్రధాన చౌరస్తాల్లో, ఆయా సంఘాలు, ఆయా పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. వీరితో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆయా పార్టీ కార్యాలయాల ముందు అధ్యక్షులు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహనీయులను స్మరించుకున్నారు.



బషీరాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో జెండా వందనంలో షాహెదాబేగం తదితరులు



తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయజెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ తారాసింగ్



పరిగి: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి, తదితరులు



దోమ: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోవిందమ్మ, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, నేతలు



కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో..



ధారూరు: మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ప్రత్యేకాధికారి రాజేశ్వరి



కొడంగల్ : జెండా ఆవిష్కరిస్తున్న డాక్టర్ చంద్ర ప్రియ



తాండూరు: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



అనంతగిరి: ఎంపీడీఓ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్



మర్పల్లి మార్కెట్ కార్యాలయ ఆవరణలో జెండా ఎగరవేస్తున చెర్మన్ మహేందర్‌రెడ్డి

ఎస్ఐపై ఫిర్యాదు

- న్యాయం చేయాలని వేడుకోలు
- స్పీకర్‌తో దాడి వివరాలు వెల్లడించిన బాధితులు

ధారూరు: భార్యాభర్తలపై, అడ్డొచ్చిన వారిపై మారణాయుధాలతో దాడిచేసిన నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ధారూరు ఎస్ఐ రాఘవేందర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన స్పీకర్‌కు దాడికి గురైన బాధితులు శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఈ నెల 13న 10మంది యువకులు, ఓ కారు, రెండు బైక్‌లపై వచ్చి, దాడి చేసిన తీరును స్పీకర్‌కు వివరించారు. న్యూడుల్స్‌లో నూనే తక్కువగా వేసి రుచి లేకుండా చేశారంటూ తమపై, మరో ఇద్దరిపై దాడి చేసిన యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయకుండా చిన్నకేసుతో సరిపెట్టారని నీరటి భారతమ్మ, అంజిలు స్పీకర్‌దృష్టికి తెచ్చారు. తెల్లకాగితంపై సంతకం చేయించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లొచ్చేవరకు నార్మల్ కేసు రికార్డు చేశరని తెలిపారు. ఈ విషయం గురించి సదరు పోలీస్ అధికారిని ప్రశ్నిస్తే పట్టించుకోకుండా నిర్లక్షంగా బదులిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన వివరాలు తెలుసుకున్న స్పీకర్ అక్కడే ఉన్న ధారూరు ఎస్ఐని పిలిపించి బాధితులకు తగిన న్యాయం చేయాలని ఆదేశించారు. దాడి ఘటనలో గాయాలు సంభవిస్తే విచారణలో తేలిన వాస్తవం మేరకు కేసు నమోదు చేయాలని ఎస్ఐకి సూచించారు. మారణాయుధాలు వాడితే హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు.

పాఠశాలకు ఆర్థికసాయం అందజేత



చెక్కు అందజేస్తున్న సంగమేశ్వర్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన సంగమేశ్వర్‌రెడ్డి ప్రతియేటా తన వంతు స్వచ్ఛందంగా ఆర్థికసాయం అందిస్తున్నారు. గతేడాది పాఠశాలకు రూ.25వేలు విలువచేసే బెంచీలు అందించగా ఈ సంవత్సరం కూడా శుక్రవారం లైబ్రరీలో పుస్తకాల కొనుగోలు కోసం రూ.15వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పాఠశాల యాజమాన్యం అతనిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామయ్య, గ్రామ పెద్దలు మల్లికార్జున్, కట్టెల రాములు, కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం అందించాలి

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: వర్షాలకు పంట నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోల్కంపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చాలా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంటలను గుర్తించి వెంటనే నష్ట పరిహారం అంచన వేయించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. అతివృష్టి, అనావృష్టి వచ్చిన బీఆర్ఎస్ అండగా ఉండేదన్నారు. కాని కాంగ్రెస్ రైతులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోల్కంపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మరో ఆరు నెలలు సేవ చేసే అవకాశం

- డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్
- పదవీకాం పొడగింపుపై హర్షం

తాండూరు రూరల్: రైతులకు మరో ఆరు నెలలు సేవ చేసే అవకాశం లభించిందని డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు మండలంలోని ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) పాలకవర్గాల కాల పరిమితిని ప్రభుత్వం ఆరు నెలలు పొడగించిందన్నారు. పదవీ కాలం పొడగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకట్రాంరెడ్డి, హన్మంత్ రెడ్డి, అనంతయ్యగౌడ్, రాఘవేందర్, పెండ్యా నర్సిములు, పార్వతమ్మ పాల్గొన్నారు.



తాండూరు రూరల్: ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న రవిగౌడ్

చెక్‌డ్యాం ఖాళీ!

బషీరాబాద్: చిత్రంలో కనిపిస్తున్నది బషీరాబాద్ మండలం, కాశీంపూర్ శివారులోని జుంటివాగు చెక్‌డ్యాం. మూడేళ్ల క్రితం నిండుకుండలా నీళ్లతో కళకళలాడేది. నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరి డ్యామేజ్ అవుతోంది. గతేడాది చిన్న గండి పడితే ఇరిగేషన్ అధికారులు ఇసుక సంచులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. తర్వాతా డ్యాం ఎడమభాగం శిఖం భూమి కబ్జాకు గురికావడంతో వరదనీరు కుడివైపునకు పారి గతంలో పడిన గండ్లు పెద్దవై వరదతో కొట్టుకుపోయింది. ప్రస్తుతం పునఃర్మిస్తే తప్పా వరదకు తట్టుకోదని పలువురు ఇంజినీర్లే చెబుతున్నారు.



నాడు నిండు కుండల నీటితోనిండిన చెక్‌డ్యాం



నేడు గండ్లుపడిన చెక్‌డ్యాం

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

- లైసెన్స్‌లేకుండా నడపొద్దు
- తాండూరు రూరల్ సీఐ నగేశ్

బషీరాబాద్: వాహనదారులు ఆర్టీఏ నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని తాండూరు రూరల్ సీఐ నగేశ్ హెచ్చరించారు. శుక్రవారం బషీరాబాద్ మార్గంలో ఎనికేపల్లి గేటు దగ్గర వాహనాల తనిఖీలు చేశారు. బైక్‌లు, ఆటోలు, జీపులు, కార్లు, ఆర్టీసీ బస్సులను ఆపి క్షుణంగా పరిశీలించారు. డ్రైవర్లకు లైసెన్సులు, వాహనాల ఆర్సీలు, ఇన్సూరెన్స్‌లు, పర్మిట్‌లను పరిశీలించారు. కార్ల అద్దాలకు అతికించిన బ్లాక్ ఫిల్మ్‌లను తీయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నగేశ్ వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో, జీపు డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించినా, వాహనాలకు ఇన్సూరెన్స్ లేకున్నా ఆ వాహనాలను సీజ్ చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622